

పైసల ముచ్చట్లు

'మావాడు అమెరికా డాలర్లు పంపిస్తున్నాడు..' అని భారత్‌లో ఉన్న ఓ తండ్రి గొప్పలు చెప్పుకోవడం మామూలే! 'మా అమ్మాయి యూరోలు పంపిస్తుంటే.. నేను ఇక్కడ ఇన్వెస్ట్ చేస్తాను' అని ఆ పిల్ల తండ్రి భవిష్యత్తుకు బాటలు పరుస్తుంటాడు. ఇంతవరకు బాగానే ఉంది. దేశం కానీ దేశంలో కష్టపడి సంపాదించిన సొమ్ము సద్వినియోగం అయితేనే కదా.. ఫలితం! కానీ, ఈ సొమ్ము భారత్‌కు ఎలా వస్తుందన్నది ప్రశ్న. ఎన్ఆర్ఐలుగా విదేశాల్లో స్థిరపడిన వ్యక్తులు భారత్‌లో అదే పల్లెటూరి బ్యాంకులో ఉన్న సేవింగ్స్ అకౌంట్‌కు డబ్బులు పంపొచ్చా? ఆ పంపిన మొత్తాన్ని వారి తల్లిదండ్రులు తీసుకోవచ్చా? ఆ అకౌంట్ నుంచి మ్యూచువల్ ఫండ్స్ లాంటివాటిలో ఇన్వెస్ట్ చేయొచ్చా? ఈ ప్రశ్నలకు సమాధానం... కాదు.. వీలు పడదు.. సమస్యాత్మకం అని చెప్పక తప్పదు!

# ఆ ఖాతాలు ఖర్చయిపోతాయ్

విదేశాల్లో ఒళ్లు విరగ కష్టపడి సంపాదించిన సొత్తును సేవింగ్స్ ఖాతాలోకి మళ్లించడం ప్రభుత్వం నేరంగా పరిగణిస్తుంది. ప్రతి పైసాకూ లెక్కున్నట్టే.. ప్రతి ఖాతాకూ కొన్ని పరిమితులు ఉంటాయి. షరతులు వర్తిస్తాయి. భారత్‌లో ఉన్నప్పుడు తెరిచిన ఖాతానే.. విదేశాల నుంచి కొనసాగిస్తానంటే ఫెమా (ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్) ఒప్పుకోదు. ఈ చట్టం గురించి తెలియదనీ, తెలిసినా పట్టించుకోనని మొండికేసి అదే తరహా లావాదేవీలు కొనసాగిస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. విదేశాల్లో సంపాదించింది డాలర్లు అయినా, యూరోలు అయినా, మరే రూపంలో అయినా.. వాటిని భారత్‌లో దాచుకోవడానికి పక్కా నిబంధనలు పాటించాలి. అవి తెలియక సేవింగ్స్ ఖాతాను విచ్చలవిడిగా వాడితే ఐటీ ఉచ్చు బిగుసుకోవచ్చు. ఆర్బీఐ నుంచి తాకీదులూ రావొచ్చు.

**అప్‌గ్రేడ్ చేసుకోండి..**

ఎన్ఆర్ఐలకు బ్యాంకింగ్ సేవలు అందించడానికి ఆర్బీఐ ప్రత్యేకమైన వెసులుబాట్లు కల్పించింది. వారికోసం ఎన్ఆర్‌వో, ఎన్ఆర్ఈ, ఎఫ్‌సీఎన్ఆర్ఈ వంటి ఖాతాలు తెరుచుకునే అవకాశం ఇచ్చింది. ఎన్ఆర్‌వో- నాన్ రెసిడెంట్ ఆర్డినరీ అకౌంట్, ఎన్ఆర్ఈ- నాన్ రెసిడెంట్ ఎక్స్‌టర్నల్ ఖాతా, ఎఫ్‌సీఎన్ఆర్- ఫారిన్ కరెన్సీ నాన్‌రెసిడెంట్ అకౌంట్ ఖాతాలు ఎన్ఆర్ఐ సేవల కోసం ఏర్పాటుచేసినవే! వీటి ద్వారా విదేశాల్లో సంపాదించే మొత్తాన్ని ఇండియాలో ఉన్న ఖాతాల్లో పొదుపు చేసుకోవచ్చు. ఆర్డినరీ అకౌంట్ విషయానికి వస్తే.. ఈ ఖాతాకు సంబంధించి లావాదేవీల్లో కొన్ని పరిమితులు ఉంటాయి. రోజువారీగా ఎంత వేయాలో, ఎంత తీయాలో బ్యాంకు షరతులకు లోబడి ఉంటాయి. ఒకరకంగా దీనిని సాధారణ సేవింగ్స్ ఖాతాగానే పరిగణించాలి. విదేశాల్లో ఉండి.. భారత్‌లో షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలన్నా, మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలన్నా, ఎస్ఐపీ లాంటి ఆప్షన్స్ ఎంచుకోవాలన్నా.. ఎన్ఆర్ఈ ఖాతా కలిగి ఉండాలి.

ఎన్ఆర్ఐ ఖాతాలకూ వడ్డీ సూత్రం వర్తిస్తుంది. మీ నిల్వలకు బ్యాంకులు వడ్డీ చెల్లిస్తాయి. ఒకవేళ కొన్నేండ్ల తర్వాత మీరు ఎన్ఆర్ఐ హోదా వదులుకుని, స్వదేశానికి వచ్చిన తర్వాత ఎన్ఆర్ అకౌంట్లను ఆర్ఎఫ్‌సీ రెసిడెంట్ ఫారిన్ కరెన్సీగా అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. ఈ ఖాతాలో ఉండే మీ డాలర్లను, యూరోలను రూపాయలుగా మారకం చేసి లావాదేవీలు కొనసాగించే వీలు ఉంటుంది.

ఇక విదేశీ కరెన్సీని అదేరూపంలో భారతీయ బ్యాంకులో పొదుపు చేయాలన్నా, వాటిని అదే రూపంలో మరెక్కడైనా ఇన్వెస్ట్ చేయదలచుకున్నా.. ఎఫ్‌సీఎన్ఆర్ ఖాతాను ఎంచుకోవాలి. అప్పుడే మీరు కష్టపడి సంపాదించే సొమ్ము చట్ట సమ్మతం అవుతుంది. అందుకే, ఎన్ఆర్ఐ హోదా పొందగానే మీ ఖాతా ఉన్న బ్యాంకుకు సమాచారం అందించి, వాటిని ఎన్ఆర్ఓ, ఎన్ఆర్ఈ అకౌంట్లుగా అప్‌గ్రేడ్ చేయమని కోరండి. అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పంపండి. ఎవరు అడుగుతారులే, నడిచినంత కాలం నడవనీ అని పాత సేవింగ్స్ ఖాతా నుంచే వ్యవహారాల్ని చేస్తానంటే మాత్రం.. వన్ బ్యాడ్ డే అకౌంట్ ఫ్రీజ్ అయ్యే ప్రమాదం ఉంది. మీ ఖాతాలు స్తంభించడమే కాదు, మీ చిట్టా అంతా పంపమని ఐటీ నిలదీసే వరకూ వెళ్లొచ్చు.

**అలాగైతే చట్ట సమ్మతం..**

ఎన్ఆర్ఐ ఖాతాలకూ వడ్డీ సూత్రం వర్తిస్తుంది. మీ నిల్వలకు బ్యాంకులు వడ్డీ చెల్లిస్తాయి. ఒకవేళ కొన్నేండ్ల తర్వాత మీరు ఎన్ఆర్ఐ హోదా వదులుకుని, స్వదేశానికి వచ్చిన తర్వాత ఎన్ఆర్ అకౌంట్లను ఆర్ఎఫ్‌సీ రెసిడెంట్ ఫారిన్ కరెన్సీగా అప్‌గ్రేడ్ చేసుకోవచ్చు. ఈ ఖాతాలో ఉండే మీ డాలర్లను, యూరోలను రూపాయలుగా మారకం చేసి లావాదేవీలు కొనసాగించే వీలు ఉంటుంది. ఈ ఎన్ఆర్ ఖాతాలను జాయింట్‌గానూ ఓపెన్ చేయొచ్చు. పార్టనర్ ఖాతాదారుడికి పూర్తిస్థాయి లావాదేవీల హక్కులు ఉండవు. ఏతావాతా విషయమేమంటంటే.. కష్టపడి చదివి, విదేశాలకు వెళ్లింది.. ఊహించనంత సంపాదించడానికే! అక్కడ వేతన రూపంలో వచ్చేదంతా ప్యూర్‌వైట్ మనీ. చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా మీరు దర్జాగా ఖాతాలో వేసుకున్న సొమ్ము చట్ట సమ్మతం కాకుండా పోయే ప్రమాదం ఉంటుంది. అందుకే, ఫెమా నిబంధనలు తెలుసుకొని, బ్యాంకు అధికారులను సంప్రదించి.. ఎన్ఆర్ఐ ఖాతాలను చట్టబద్ధంగా నిర్వహించుకుంటే ఎవరికీ ఏ సమస్యా రాదు! ■




**ఎం. రాం ప్రసాద్**
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్
ram@rpwealth.in
www.rpwealth.in